ఆందోళనలతో అట్టుడికిన సమావేశం



నేలపై కూర్చొని నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ సర్పంచులు, ఎంపీటీసీలు



ఎంపీపీని నిలదీస్తున్న అడ సర్పంచ్ పాయల్ శరత్, ఇతర నాయకులు

- ప్రొటోకాల్‌పై భగ్గుమన్న బీజేపీ ఎంపీటీసీలు, సర్పంచులు
- తమ గ్రామాలపై వివక్ష చూపిస్తున్నారని మండిపాటు
- సభ మధ్యలో వెళ్లిపోయిన ఎంపీపీ

జైనథ్: మండల కేంద్రంలోని రైతువేదికలో శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం ఆందోళనలతో అట్టుడికింది. బీజేపీ ఎంపీటీసీలు, సర్పంచుల ఆందోళనల నడుమ ప్రారంభమైన గంటకే సమావేశం ముగిసింది. పల్లెల్లో అభివృద్ధి పనులకు భూమి పూజ కార్యక్రమంలో అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని, తమ గ్రామాలకు నిధులు కేటాయించకుండా కావాలనే వివక్ష చూపిస్తున్నారంటూ వారు సభలో ఆందోళనకు దిగారు. దీంతో ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్ సభ మధ్య నుంచి వెళ్లిపోయారు. కాగా, సమావేశం ముగిసినట్లు ఎంపీడీవో గజానన్‌రావ్ ప్రకటించారు.

ఈజీఎస్ అంశంతో మొదలైన లొల్లి..

సమావేశం 11:30 గంటలకు ప్రారంభం కాగా వ్యవసాయం, సివిల్ సప్లై, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, విద్య, వైద్యం తదితర అంశాలకు సంబంధించిన ప్రగతి నివేదికలను శాఖల అధికారులు చదివి వినిపించారు. పంచాయతీరాజ్ అంశం రాగానే ఏఈ హరీశ్ ప్రగతి నివేదిక చదివారు. అయితే ఇటీవల కంఠ గ్రామంలో ఈజీఎస్ నిధులు రూ.1.50 కోట్లతో ఎమ్మెల్యే జోగు రామన్న సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. కార్యక్రమానికి ఎంపీటీసీ వైష్ణవి చౌదరిని ఆహ్వానించకుండా అవమానించారని బీజేపీ సర్పంచులు, ఎంపీటీసీ ఆందోళన చేపట్టారు. దీంతో ఎంపీపీ గోవర్ధన్ పీఆర్ ఏఈ హరీశ్‌ను ఇదే విషయమై నిలదీశారు. స్థానిక ఎంపీటీసీని పిలవలేదని ఆయన బదులివ్వడంతో, ఎంపీపీ సభలో మర్యాద పూర్వకంగా క్షమాపణలు చెప్పారు. దీంతో వారు శాంతించడంతో సమావేశం ముందుకు సాగింది.

ఈజీఎస్ నిధులపై స్పష్టత ఇవ్వాలని ఆందోళన

ఈజీఎస్ అంశం రాగానే ఇన్‌చార్జి ఏపీవో రమణ ప్రగతి నివేదికలను చదివి వినిపించేందుకు రాగా, కంఠలో ఎమ్మెల్యే జోగు రామన్న భూమిపూజ చేసిన నిధులు కేంద్రానివా? రాష్ట్రానివా? సభలో స్పష్టత నివ్వాలని బీజేపీ ఎంపీటీసీలు, సర్పంచులు పట్టుబట్టారు. అధికారులు గ్రామాలపై ఉద్దేశపూర్వకంగా నిధులు కేటాయించకుండా వివక్ష చూపుతున్నారని మండిపడ్డారు. స్వయంగా ఎమ్మెల్యే జోగు రామన్న హామీ ఇచ్చినప్పటికి కూడా అధికారులు తమ గ్రామాల అభివృద్ధికి నిధులు ఎందుకు కేటాయించడం లేదని వాపోయారు. అడ సర్పంచ్ పాయల్ శరత్, కొత సర్పంచ్ భోయర్ విజయ్, దీపాయిగూడ ఎంపీటీసీ లోక కరుణాకర్‌రెడ్డి, పార్డి(కే) సర్పంచ్ అస్తక్ ఉజ్వల, లక్ష్మీపూర్ ఎంపీటీసీ కాంబ్లే జయమాల, తరోడ సర్పంచ్ గజానన్‌లు నేలపై కూర్చొని తమ నిరసన తెలియజేశారు. ఈజీఎస్ నిధులపై స్పష్టత ఇవ్వనిదే సమావేశం ముందుకు సాగనివ్వమని బైఠాయించడంతో ఎంపీపీ మధ్యలో వెళ్లిపోయారు.

ఎంపీపీ చాంబర్ ఎదుట బైఠాయింపు

ఎంపీపీ వెళ్లిపోవడంతో ఎంపీపీ చాంబర్ ఎదుట బీజేపీ సర్పంచులు, ఎంపీటీసీ బైఠాయించారు. ప్రజలకు వాస్తవాలు తెలియాలని కేంద్రం నుంచి వచ్చిన నిధులను రాష్ట్ర నిధులుగా చెప్పుకుంటూ అధికార పక్షం నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆందోళన చేపట్టారు. ఎంపీపీ తన చాంబర్‌కి రాకపోవడంతో ఆందోళన విరమించారు.

క్లుప్తంగా

ఆన్‌లైన్ నృత్య పోటీల్లో బాలకేంద్రం చిన్నారులు



నృత్యం చేస్తున్న చిన్నారి

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని బాలకేంద్రం చిన్నారులు ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన భరతనాట్యం నృత్య పోటీల్లో శనివారం పాల్గొన్నారు. మహిషాసుర మర్దిని స్తోత్రంపై చిన్నారులు హర్షిని, ఆద్యలు ప్రదర్శించిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. విజేతలుగా నిలిచిన 32 మందికి నగదు బహుమతి, అదే విధంగా 160 మందికి మెమెంటోలు కొరియర్ ద్వారా అందజేస్తారని బాల కేంద్రం పర్యవేక్షకుడు మిట్టు రవి తెలియజేశారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: కేఎంసీ పీజీ వైద్య విద్యార్థిని ఆత్మహత్యాయత్నం ఘటనపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఏబీవీపీ ఆధ్వర్యంలో బస్టాండ్ ఎదుట శనివారం రాస్తారోకో చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు అక్కడి చేరుకుని ఆందోళనకారులను సముదాయించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు నిఖిల్, అక్షయ్ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన నేతకాని మహర్ నాయకులు



కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

బోథ్: కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను జిల్లాకేంద్రంలో నేతకాని మహర్ సంఘం నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు. తమ సమస్యలను విన్నవించారు. రాష్ట్ర అధ్యక్షుడు జాడి నర్సయ్య, కార్యవర్గ సభ్యుడు రామారావు పాటిల్, జిల్లా అధ్యక్షులు కాంబ్లి భీంరావ్, మునేశ్వర్ సుదర్శన్, స్వప్నిల్ తదితరులు ఉన్నారు.


నేతకాని మహర్ రాష్ట్ర అధ్యక్షురాలికి సన్మానం



సోంబాయిని సన్మానిస్తున్న మహిళలు

కైలాస్‌నగర్: నేతకాని మహర్ (ఇన్కర్) మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగా ఇటీవల ఎన్నికైన సర్పే సోంబాయిని ఇచ్చోడ, గుడిహత్నూర్, బజార్‌హత్నూర్ మండలాలకు చెందిన నాయకురాళ్లు శనివారం సన్మానించారు. స్థానిక టీచర్స్‌కాలనీలోని ఆమె నివాసంలో కలిసి సంఘ సభ్యులు పూలమాల, శాలువలతో సత్కరించి అభినందనలు తెలిపారు. పొన్న సర్పంచ్ కనిందే చంద్రకళ, దేవుతాడే లక్ష్మి, జక్కుల రాధ, గులే లత, బోరేకర్ శశికళ, డొంగ్రే ఉష తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు అడ్వకేట్ జనరల్‌ను కలిసిన రాష్ట్ర బృందం



ప్రసాద్‌ను కలిసిన ఆదివాసీ సేన బృందం

ఆదిలాబాద్‌రూరల్: హైకోర్టు అడ్వకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్‌ను శనివారం ఆదివాసీ సేన తెలంగాణ రాష్ట్ర బృందం సభ్యులు కలిశారు. రాష్ట్ర అధ్యక్షుడు కోవ దౌలత్‌రావు మొకాశి పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆదివాసీ నిరుద్యోగుల, యువతకు విద్య, ఉద్యోగ అవకాశాలు, ప్రమోషన్లలో లబ్ధి చేకూరేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. న్యాయ స్థానాల్లో షెడ్యూల్ ఏరియా, ఆదివాసీల కేసులు ప్రత్యేకంగా పరిష్కరించ దానికి బెంచ్ ఏర్పాటు చేయాలన్నారు. హైకోర్టు అడ్వకేట్ సోడే వేంకటేశ్వర్లు, న్యాయవాదులు మడి సాయిబాబు (ఉమ్మడి వరంగల్), కొమరం అనిల్ కుమార్ (ఉమ్మడి ఖమ్మం) తదితరులు ఉన్నారు.

'డబుల్' లబ్ధిదారుల ఎంపిక గ్రామసభ వాయిదా



గ్రామసభలో పాల్గొన్న తహసీల్దార్ లక్ష్మణ్, గ్రామస్తులు

నార్నూర్: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో శనివారం డబుల్ బెడ్రూం లబ్ధిదారుల ఎంపికకు ఏర్పాటు చేసిన గ్రామసభ వాయిదా వేసినట్లు తహసీల్దార్ దుర్వా లక్ష్మణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీన్‌గూడ ఆదర్శ పాఠశాల సమీపంలో ప్రభుత్వ స్థలంలో మొత్తం 15 డబుల్ బెడ్రూంలు ఉన్నాయని అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకే ఇవ్వాలని కొందరు హైకోర్టును ఆశ్రయించారని అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో లబ్ధిదారుల ఎంపికకు గ్రామ సభ నిర్వహించామన్నారు. మండల కేంద్రంలో గిరిజనేతరులు నివాసం ఉంటున్నారని వారికి ఉండడానికి డబుల్ బెడ్రూంలు వర్తించేలా చూడాలని అధికారుల దృష్టికి తీసుకువచ్చారన్నారు. డబుల్ బెడ్రూంలు అసంపూర్తిగా, ఉండడం, సమస్యల కారణంగా లబ్ధిదారుల ఎంపిక వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. సర్పంచ్ బానోత్ గజానంద్‌నాయక్, డిప్యూటీ తహసీల్దార్ అమృత్‌లాల్, సర్వేయర్ అలాసింగ్, ఆర్‌ఐ కవిత, పీఏసీఎస్ చైర్మన్ అడే సురేష్, డైరెక్టర్ దుర్గే కాంతారావు, ఆర్‌ఎస్‌ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దుర్గే మహేందర్, బీసీ సంఘం నాయకుడు జ్ఞానోబా పుస్కర్, షేక్ దస్తగిర్, కాంగ్రెస్ నాయకుడు లొఖండే దేవురావు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన



బైఠాయించిన కనుగుట్ట రైతులు

బోథ్: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట కనుగుట్ట గ్రామ రైతులు శనివారం ఆందోళన నిర్వహించారు. బైఠాయించి తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దవాగుతోపాటు కెనాల్‌లో ఎగువన ఉన్న రైతులు నీటిని తమ చేన్లలోకి తరలిస్తున్నారని అన్నారు. దీంతో దిగువన ఉన్న చేలకు నీరందడం లేదని వాపోయారు. కొందరు తమ చేలల్లో బోర్లు ఉన్నా కెనాల్ నీటిని వాడుతున్నారని అన్నారు. దీంతో తమ చేలకు నీరందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

అన్నివర్గాలకు సంక్షేమ పథకాలు




లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్న మనోహర్

బేల: సీఎం కేసీఆర్ అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రావుత్ మనోహర్ పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో 34 మంది కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.1,00116 చెక్కులను శనివారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాల్లో బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎందుకు అందించడం లేదని ప్రశ్నించారు. తెలంగాణలో అమలవుతున్న ప్రతి పథకంలో కేంద్రం నుంచే నిధులు వస్తున్నాయని బీజేపీ నాయకులు అసత్య ప్రచారం చేయడం వారి మూర్ఖత్వానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఠాక్రే వనిత గంభీర్, తహసీల్దార్ బడాల రాంరెడ్డి, నాయకులు జక్కుల మధుకర్, సతీశ్‌పవార్, బండి సుదర్శన్, ఠాక్రే మంగేష్, గోడం సునీల్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న హాథ్ సే హాథ్ జోడో యాత్ర

ఆదిలాబాద్‌అర్బన్: కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో యాత్ర ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతోంది. శనివారం ఆరో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పార్టీ పట్టణ అధ్యక్షుడు జి.నగేశ్ మాట్లాడుతూ పట్టణంలో రైతు బజార్ ప్రాంతంలో గడప గడపకూ తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఎలాంటి అభివృద్ధి ఫలాలు అందుతాయో వివరించారు. అనంతరం కూరగాయల విక్రయదారులతో మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌పై, కేంద్రంలోని బీజేపీపై పూర్తిగా వ్యతిరేకత ఉందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అల్లూరి సంజీవ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఖడే సంతోష్, మోతీరాం, గోవర్ధన్‌రెడ్డి, కాంబ్లే శివాజీ, చంద్రశేఖర్, షమీర్, వాషిముద్దీన్, గౌస్‌బాయ్, తాహెర్ ఖాన్, రసూల్ ఖాన్, గంగామణి, పాహిమ్ తదితరులు పాల్గొన్నారు.

'కమీషన్లకు కక్కుర్తిపడి అడ్డగోలుగా నిధులు'



మాట్లాడుతున్న పాయల్ శంకర్

ఆదిలాబాద్: పట్టణ అభివృద్ధికి కేంద్రం విడుదల చేసిన నిధులను బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు కమీషన్లకు కక్కుర్తిపడి అడ్డగోలుగా వాడుకున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ అన్నారు. జిల్లాకేంద్రంలోని శాంతినగర్‌లో గందేవార్ తోట కాలనీలో శనివారం నిర్వహించిన కార్నర్ మీటింగ్ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు కేంద్ర ప్రభుత్వం రూ.100 కోట్ల నిధులను మంజూరు చేస్తే వాటిని ఇష్టానుసారంగా ఖర్చు చేశారని ఆరోపించారు. పార్టీ రాష్ట్ర నాయకురాలు చిట్యాల సుహాసినిరెడ్డి, నాయకులు ఆదినాథ్, దినేష్ మటోలియా, జోగు రవి, మయూర్ చంద్ర, వేణుగోపాల్, లాలామున్న, కృష్ణయాదవ్, జ్యోతిరెడ్డి, మహేందర్ పాల్గొన్నారు.

'వచ్చే ఎన్నికల్లో బీజేపీదే విజయం'

తలమడుగు: వచ్చే ఎన్నికల్లో బీజేపీదే విజయం సాధిస్తుందని జిల్లా రిటైర్డ్ టీచర్ ఉద్యోగ సంఘ అధ్యక్షుడు నల్ల రత్నాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని రత్నపూర్, రుయ్యడి, గ్రామాల్లో శనివారం ప్రజాగోస బీజేపీ భరోసాలో భాగంగా కార్నర్ మీటింగ్ నిర్వహించారు. నాయకులు స్వామి, కిరణ్, దేవన్న, ధనుంజయ్, రాజు, శేఖర్, శ్రీనివాస్, స్వామి, పోచన్న, ప్రకాశ్, నరేశ్ పాల్గొన్నారు.

పరామర్శ

జైనథ్: మండలంలోని గూడ గ్రామానికి చెందిన ప్యాలపు దత్తు ఇటీవల ప్రమాదానికి గురయ్యారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి శనివారం గూడ గ్రామానికి వెళ్లి దత్తును పరామర్శించారు. సర్పంచ్ నిమ్మల ప్రభాకర్, డీసీసీబీ డైరెక్టర్ పురుషోత్తం యాదవ్, ఉప సర్పంచ్ సుభాష్ ఉన్నారు.

హీరాసుక్కా జయంతిని విజయవంతం చేయాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న సభ్యులు

జైనథ్: జిల్లాకేంద్రంలోని రామ్‌లీలా మైదానంలో ఈనెల 28న నిర్వహించనున్న ఆది గురువు హీరాసుక్కా జయంతి వేడుకలను విజయవంతం చేయాలని పర్ధాన్ సమాజ్ మండల అధ్యక్షుడు గంగ ప్రసాద్ కోరారు. మంగళవారం ఆయన మండలంలోని పిప్పల్‌గావ్, దీపాయిగూడ, ఆనంద్‌పూర్, కూర, కరంజి, ఖాప్రి, బెల్గాం, బెల్లూరి, మాకోడ, ఉమ్రి, జైనథ్ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా జయంతి కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హీరాసుక్కా జయంతికి పర్ధాన్ కులస్తులంతా పెద్దసంఖ్యలో హాజరుకావాలని కోరారు. నాయకులు రాకేశ్, విఠల్, సత్యనారాయణ, సునీల్, శ్రీనివాస్, శత్రుఘన్, సుభాష్, రఘురాం, భగవాన్, ప్రకాశ్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

ఆదిలాబాద్‌టౌన్: జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు షాహిద్ అహ్మద్ తవక్కల్ అన్నారు. జిల్లాకేంద్రంలోని టీఎన్జీవో భవనంలో జర్నలిస్ట్ ఫెడరేషన్ నూతన కమిటీని రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎజాజ్ అహ్మద్ ఖాన్, మహమ్మద్ జమీల్ ఆధ్వర్యంలో శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా షాహిద్ అహ్మద్, ప్రధాన కార్యదర్శిగా ఖిజర్ అహ్మద్, ఉపాధ్యక్షుడిగా ఆసిఫ్ ఉద్దీన్, అఖిల్ అహ్మద్, కోశాధికారిగా షేక్ అస్మత్ అలీ, ఆర్గనైజర్ సెక్రెటరీ అమిమ్ షరీఫ్, సభ్యులుగా సల్మాన్, జాకీర్, అశ్వక్, మహమూద్, మూస తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను శాలువాతో సత్కరించి అభినందించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ, కాంగ్రెస్ నాయకులు అర్షాద్, మోసీన్, బిలాల్ తదితరులు నూతన కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు.

నూతన కార్యవర్గం

బేల: నాయీబ్రాహ్మణ మండల నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బర్కాడే రాము(బేల), ఉపాధ్యక్షుడిగా కాందేకార్ ప్రశాంత్ (బేల), ప్రధాన కార్యదర్శగా హడత్కర్ బాలాజీ(దహెగాం), సలహాదారుగా కాందేకార్ రాహుల్, వడస్కర్ రాకేశ్‌తోపాటు మరో ఐదుగురు సభ్యులతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం నాయకులు బండు, పొచ్చన్న, సురేష్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్



తాంసిలో కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే, డీసీసీబీ చైర్మన్

తాంసి: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డితో కలిసి శనివారం 13 మంది కల్యాణ లక్ష్మి, 14 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం మండల కేంద్రంలో రూ.5 లక్షలతో నిర్మించే రెడ్డి సంక్షేమ సంఘం భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. తర్వాత తాంసిలోని ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడలేని విధంగా తెలంగాణలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. మండల కేంద్రం సమీపంలోని వాగుపై రూ.3.20 కోట్లతో నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. తాంసి, భీంపూర్ మండలాల్లో రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణాల కోసం రూ.కోట్ల నిధులు కేటాయించామన్నారు. ప్రతిపక్ష పార్టీల నాయకుల మాటలను ప్రజలు నమ్మొద్దన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తాటిపెల్లి రాజు, తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో రవీందర్, వైస్ ఎంపీపీ రఘు, పార్టీ కన్వీనర్ అరుణ్, రెడ్డి సంఘం అధ్యక్షులు రాంరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, నారాయణరెడ్డి, సర్పంచులు సదానంద్, వెంకన్న, శ్రీనివాస్, సంజీవ్‌రెడ్డి, కృష్ణ, పార్టీ నాయకులు శ్రీధర్‌రెడ్డి, మహేందర్, పరమేశ్ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి

తలమడుగు: భరంపూర్‌లోని శ్రీ వేంకటేశ్వర ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్ అన్నారు. మండలంలోని భరంపూర్ సమీపంలో కొండపై వేంకటేశ్వర ఆలయంలో ఆయన పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయంలో గత నాలుగు రోజులుగా బ్రహ్మోత్సవాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ప్రతిఏటా బ్రహ్మోత్సవాలకు వస్తున్నానని, ఈసారి రాలేకపోయానని అన్నారు. అందుకే శనివారం స్వామివారిని దర్శించుకుని పూజలు చేశానన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఆలయ కమిటీ సభ్యుడు ప్రేమేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ వెంకటేశ్, నాయకులు మొట్టె కిరణ్‌కుమార్, అబ్దుల్లా, శాస్త్రి, నవీన్‌గౌడ్, రమాకాంత్, నర్సయ్య పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న దుర్గారాణి

ఉట్నూర్‌రూరల్: చట్టాలపై అవగాహన పెంచుకోవాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ దుర్గారాణి అన్నారు. మండల కేంద్రంలోని టీడబ్ల్యూఆర్‌జేసీ జూనియర్ కళాశాలలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఉట్నూర్ ఆధ్వర్యంలో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గారాణి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే చట్టాల గురించి తెలుసుకోవాలన్నారు. అక్రమ రవాణా, లైంగిక, ఉపాధి బాధితుల అంశం, తదితర పలు చట్టాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. న్యాయవాదులు జగన్, అశోక్, రాజు, ప్రిన్సిపాల్ సుమలత పాల్గొన్నారు.

ఇచ్చోడ: ప్రతి విద్యార్థికి చట్టాలపై అవగాహన ఉండాలని హెడ్ కానిస్టేబుళ్లు రంగారావు, దత్తు అన్నారు. వివేకానంద జూనియర్ కళాశాల విద్యార్థులు వీకెండ్ ప్రాక్టికల్ లర్నింగ్ టూర్‌లో భాగంగా ప్రిన్సిపాల్ నిఖిని వర్మ ఆధ్వర్యంలో శనివారం పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఫిర్యాదుల స్వీకరణ, కేసు నమోదు తీరు, ఫిర్యాదుదారుల నుంచి స్వీకరిస్తున్న దరఖాస్తులు అందాల్సిన న్యాయంపై వారికి పోలీసులు వివరించారు.

బోథ్: మండలంలోని పార్డి(బి), టివిటి, పరుపుపల్లె గ్రామాల్లో న్యాయవాది పంద్రం శంకర్ గ్రామస్తులకు శనివారం చట్టాలపై అవగాహన కల్పించారు. ఆదివాసీలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలకు పరిష్కార మార్గాలు ఎంచుకోవాలన్నారు. యువత పోటీ ప్రపంచంలో చదువుతో పాటు అన్ని రంగాల్లో ముందుకు వెళ్లాలని అన్నారు. సర్పంచ్ సుగ్నక్ మారుతి, సార్మెడి తొడసం లక్ష్మణ్, పటేళ్ల జైతు, జుగాదిరావ్, కైలాస్, మాజీ సర్పంచ్ గోపాల్ ఉన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ వైసీ శ్రీనివాస్

గుడిహత్నూర్: నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం గర్భిణి, బాలింత, చిన్నారులకు ఇవ్వాల్సిన టీకాలు అందించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి వైసీ శ్రీనివాస్ అన్నారు. శనివారం స్థానిక పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. నెలనెలా అందించాల్సిన టీకాలు సరైన సమయంలో లబ్ధిదారులకు అందాలన్నారు. ఈ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైన వెంటనే సమాచారం అందించాలన్నారు. రికార్డులు పరిశీలించిన అనంతరం ఆయన టీకాలు నిల్వ చేస్తున్న విధానం తదితర అంశాలను ఫార్మసిస్ట్ శివాజీని అడిగి తెలుసుకున్నారు. ఎంసీహెచ్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ విజయసారథి, మండల వైద్యాధికారి డాక్టర్ శ్యాంసుందర్ ఉన్నారు.

పరిహారం ఇవ్వకుంటే పనులు అడ్డుకుంటాం



రిలే దీక్షలో బాధిత రైతులు

తాంసి: పిప్పల్‌కోటి రిజర్వాయర్ నిర్మాణంలో ముంపునకు గురవుతున్న సాగు భూములకు పరిహారంపై ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే నిర్మాణ పనులు అడ్డుకుంటామని ముంపు రైతులు హెచ్చరించారు. రిజర్వాయర్ నిర్మాణంలో ముంపునకు గురవుతున్న భూములకు పరిహారం పెంచి ఇవ్వాలని కోరుతూ రైతులు చేపట్టిన రిలే దీక్షలు శనివారం 12వ రోజుకు చేరుకున్నాయి. పిప్పల్‌కోటి ముంపు రైతులు రిలే దీక్షలో పాల్గొని పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ 12రోజులుగా శాంతియుతంగా ఆందోళన చేస్తున్న పరిహారంపై ప్రభుత్వం స్పందించకపోవడం సరికాదన్నారు.

సంక్షిప్త వార్తలు

పారిశుధ్య కార్మికుడిని ఢీకొన్న ప్రొక్లెయినర్

ఆదిలాబాద్‌టౌన్: మున్సిపల్ పారిశుధ్య కార్మికుడిని ప్రొక్లెయినర్ ఢీకొన్న సంఘటన పట్టణంలోని ఖుర్షీద్ నగర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై విష్ణుప్రకాశ్ కథనం ప్రకారం.. పట్టణంలోని గడియార్ మైలాకు చెందిన కట్కూరి అశోక్ స్థానిక మున్సిపల్‌లో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఖుర్షీద్‌నగర్ గ్రామీణ బ్యాంకు సమీపంలోని విధుల్లో భాగంగా రోడ్డు ఊడుస్తుండగా అటుగా వెళ్తున్న ఓ ప్రొక్లెయినర్ ఆయన్ను ఢీకొంది. దీంతో ఆయనకు గాయాలయ్యాయి. వెంటనే రిమ్స్‌కు తరలించారు. బాధితుడి భార్య అనిత ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్టీవో అధికారుల స్పెషల్ డ్రైవ్

బోథ్: బోథ్, నేరడిగొండ మండలాల్లో శనివారం ఆర్టీవో అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనాలపై ఉన్న జరిమానాలు చెల్లిస్తే 25 శాతం రాయితీ ఉందన్నారు. జరిమానా ఉన్న వాహనాలు అధికారులకు చిక్కితే 200 శాతం జరిమానా ఉంటుందని పేర్కొన్నారు. నేరడిగొండ 4, బోథ్‌లో 8 వాహనాలను పట్టుకుని స్థానిక పోలీస్‌స్టేషన్ కు తరలించినట్లు తెలిపారు ఏఎంవీఐ భిక్షపతి, సిబ్బంది ఉన్నారు.

పాఠశాలల తనిఖీ

తలమడుగు: మండలంలోని ఉమ్రీ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, పూనగుడ ఆశ్రమ పాఠశాలను శనివారం జీసీడీవో మేస్రం చాయ తనిఖీ చేశారు. విద్యార్థుల సమస్యలు తెలుసుకున్నారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులున్నారు.

ఉత్సాహంగా ఫుడ్ ఫెస్టివల్

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇంటి నుంచి వివిధ రకాల వంటకాలను తయారు చేసి తీసుకువచ్చారు. ప్రదర్శనతో పాటు అమ్మకాలు చేపట్టారు.

కాంగ్రెస్ ప్లీనరీలో జిల్లా నాయకులు

గుడిహత్నూర్/బోథ్: ఛత్తీస్‌గఢ్‌లో రాయ్‌పూర్‌లో నిర్వహిస్తున్న కాంగ్రెస్ 85వ ప్లీనరీకి శనివారం పార్టీ జిల్లా నాయకులు పాల్గొన్నారు. మాజీ మంత్రి రాంచంద్రారెడ్డి, ఏఐసీసీ సభ్యుడు నరేశ్ జాదవ్, టీపీసీసీ కార్యవర్గ సభ్యుడు వన్నెల అశోక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సత్యనారాయణ ఉన్నారు.

గొర్రెలు, మేకలకు నట్టల నివారణ టీకాలు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని బట్టిసావర్గాం గ్రామంలో ఎంపీపీ సంగీత, సర్పంచ్ గంగమ్మ శనివారం గొర్రెలు, మేకలకు నట్టల నివారణ టీకాలు వేశారు. మండల పశువైద్యాధికారి దుద్‌రామ్, వైద్య సిబ్బంది ప్రసాద్, రమేశ్ పాల్గొన్నారు.

ఇచ్చోడ: చింబోలి, గేర్జం గ్రామాల్లో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి గోవింద్‌నాయక్ తెలిపారు.

వచ్చేనెలలో శనగ కొనుగోళ్లు

జైనథ్: మండలంలో ఇంకా పూర్తిస్థాయిలో శనగ కోత పనులు పూర్తి కానందున మండల కేంద్రంలోని మార్కెట్‌యార్డులో కొనుగోళ్లు మార్చి 2 తర్వాత ప్రారంభిస్తామని ఏఎంసీ వైస్ చైర్మన్ వేణుగోపాల్ యాదవ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వచ్చే నెల 27 నుంచి ఆదిలాబాద్ మార్కెట్ యార్డ్‌లో శనగ కొనుగోళ్లు ప్రారంభమవుతాయని తెలిపారు.

జగదాంబదేవికి పూజలు

నేరడిగొండ: రాజూరా జగదాంబ ఆలయ వార్షికోత్సవం కనులపండువగా జరిగింది. ఈ సందర్భంగా జెడ్పీటీసీ అనిల్ జాదవ్ దంపతులు ఆలయంలో హోమం నిర్వహించి, జగదాంబ దేవికి పూజలు నిర్వహించారు. సర్పంచ్ అనూష, వసంతరావ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

తాంసి: మండలంలోని పొన్నారి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కప్పర్ల పాఠశాలలో ఉపాధ్యాయుడు విలాస్‌గౌడ్ శనివారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. రూ.2 వేల విలువ గల పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు విరాళంగా అందజేశారు. సర్పంచ్ సంజీవ్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రఘు, ఉపాధ్యాయులు రమణ, మహేశ్వరం ఉన్నారు.